క్లుప్తంగా

రేపటి నుంచి అంగన్‌వాడీలు సమ్మెబాట

తెనాలిటౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు శుక్రవారం నుంచి నిరవధిక సమ్మె బాట పట్టనున్నట్లు అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఏవీఎస్ కుమారి తెలిపారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలో గురువారం పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి సుభాష్ చంద్రబోస్‌కు సమ్మె నోటీసును అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు నవ్య, విమల కుమారి, నాగజ్యోతి, మాధవి, ఆలిస్, మరియమ్మ, తదితరులు పాల్గొన్నారు. కొలవరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు వినతిపత్రం సమర్పించారు. తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించాలని వారు కోరారు. పెదరావూరు, జగ్గడిగుంటపాలెం గ్రామాల్లో కూడా వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు టి.పావని, డి.అనురాధ, కె.కుసుమకుమారి, పి.విజయలక్ష్మి, కె.నాగరాజకుమారి, కె.నాగలక్ష్మి, కె.జ్యోతి పాల్గొన్నారు.

నూతన పైపులైన్లు ఏర్పాటు చేయాలి

మంగళగిరి: నగర పరిధిలో తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా పైపులు మరమ్మతులకు గురైన చోట్ల నూతన పైపులైన్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) సూచించారు. నగరంలో తాగునీటి సరఫరా చేసే పైపులైన్లు మరమ్మతులకు గురి కాగా అధికారులతో కలసి ఆయా ప్రాంతాలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ తాగునీటి సరఫరాల ప్రజలకు ఇబ్బంది లేకుండా తక్షణం పరిష్కంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్ పాల్గొన్నారు.

సంస్కృతి సంప్రదాయాలను నేటి తరానికి అందించాలి

తాడేపల్లిరూరల్: భారతీయ సంస్కృతి సంప్రదాయాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని హార్నిక్స్ రీజెన్సీ ప్రైవేటు లిమిటెడ్ డైరెక్టర్ రాజేశ్వరి అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలోని గోశాలలో గర్భం దాల్చిన ఒక ఆవుకు (పుంగనూరు జాతి) సీమంత కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వర్సిటీలోని గోశాల, ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం సారథ్యంలో గోశాలలో దేశీయ జాతులు, గిర్, కపిల, ఒంగోలు ఆవులతో సహా మొత్తం 26 ఆవులను కేఎల్‌యూ సంరక్షిస్తోందని తెలిపారు. వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగం డీన్ డాక్టర్ వి.రాజేష్, అసోసియేట్ డీన్ కె.జె.బ్రహ్మచారి, డాక్టర్ జి.ఆర్.కె.ప్రసాద్, డాక్టర్ కె.వి.ఎన్.ఆర్.జి.రామారావు, హార్టి కల్చర్ మేనేజర్ లోకేష్‌రెడ్డి, మెస్ ఇన్‌చార్జి పర్చూరి వేణు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సహాయం

తాడేపల్లిరూరల్: మిచాంగ్ తుఫాన్ కారణంగా ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణ పరిధిలోని డోలాస్‌నగర్, బాపనయ్య పేటకు చెందిన ఓ వ్యక్తి ఇంటిపై చెట్టుపడి ఇళ్లు కోల్పోవడంతో బుధవారం స్థానిక నాయకుల ద్వారా సమాచారం అందుకున్న వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈదులమూడి డేవిడ్‌రాజు బాధిత కుటుంబానికి ఆ సహాయాన్ని అందజేశారు. బాపనయ్య పేటకు చెంది కంభంపాటి దానియేలుకు రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సేవాదళ్ నాయకులు రమేష్ పాల్గొన్నారు.

మోతడకలో ఫారం-7 అర్జీలు నిష్పక్షపాతంగా పరిశీలించాలి

తాడికొండ: మోతడక గ్రామంలో ఓటర్ల జాబితాలో బీఎల్‌వోలు, అధికారుల నుంచి వచ్చిన ఫారం-7 అర్జీలను నిష్పక్షపాతంగా పరిశీలించాలని వైఎస్సార్ సీపీ మోతడక నాయకులు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.రవీంద్రరావును కోరారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి వినతిపత్రం అందజేశారు. వారు తమ గ్రామంలో ఓటర్ల జాబితాలో జరిగిన లోపాలను వివరించి ఇతర ప్రాంతాలలో నివసిస్తూ ఇక్కడ ఓటుహక్కు కల్పించుకున్న కొంతమంది వ్యక్తుల జాబితాను పూర్తిస్థాయి విచారణ జరిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు వెంకటయ్య మాస్టారు, వాడకొప్పుల రాజు, సంసోన్, సంకూరు జయపాల్, నిమ్మగడ్డ ప్రసాద్, చాగంటి కోటేశ్వరరావు ఉన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు



మంగళగిరి: పట్టణంలోని గండాలయ పేటకు చెందిన ఆనంద్‌బాబు కనిపించడం లేదని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు బుధవారం తెలిపారు. వివరాలు.. ఆనంద్, మెయిన్‌బజార్‌లోని వస్త్రదుకాణంలో పనిచేస్తున్నాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అధ్వానంగా ఉండడం, కుమార్తెకు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో మనస్తాపంతో మెసేజ్ పెట్టి వెళ్లిపోయాడు. ఆచూకి కొరకు ఎంత వెతికినా కనిపించకపోవడంతో భార్య మీనాక్షి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అధైర్యపడొద్దు.. ప్రభుత్వం ఆదుకుంటుంది

- ఎమ్మెల్యే శివకుమార్ భరోసా
- పలు గ్రామాలల్లో నేలవాలిన పంటల పరిశీలన



వల్లభాపురం గ్రామంలో దెబ్బతిన్న వరి పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: అధైర్య పడవద్దని, తుఫాన్ వలన పంట దెబ్బతిన్న ప్రతి రైతుకూ ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ హామీ ఇచ్చారు. మిచాంగ్ తుఫాను ప్రభావంతో మండలంలోని శిరిపురం, కుంచవరం, అత్తోట, యాదవపాలెం, దంతలూరు, మున్నంగి, వల్లభాపురం ఆయా గ్రామాలల్లో నేలవాలిన వరి పొలాలను వ్యవసాయాధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి బుధవారం పరిశీలించారు. తుఫాన్ కారణంగా పంట ఎంత మేరకు నష్టం జరుగుతుంది, ఎంత పెట్టుబడి అయింది అన్న అంశాలను అధికారులతో రైతులతో మాట్లాడి తెలుసుకొని , రైతులను అన్ని విధాల ఆదుకునేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి వెంట ఉంటారని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొల్లిపర మండలంలో సుమారు 14,024 ఎకరాలల్లో వరి సాగు చేస్తుండగా తుఫాన్ కారణంగా 9,340 ఎకరాల్లో ప్రాథమికంగా నష్టం జరిగినట్లు, మినుము సుమారు 840 ఎకరాలల్లో సాగు చేస్తుండగా 240 ఎకరాలల్లో నష్టం జరిగిందన్నారు. అరటి 1400 ఎకరాలల్లో సాగుచేస్తుండగా 160 ఎకరాలల్లో నష్టం జరిగిందని అధికారులు అంచాన వేసినట్లు తెలిపారు.

ప్రతి పక్షనేతల విమర్శలల్లో వాస్తవంలేదు...

ఇతర పార్టీ టీడీపీ, జనసేన నేతలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పై బురద జల్లటానికి ఈనాడు రైతులకు ప్రభుత్వం పంటల బీమా(ఇన్సూరెన్స్) చేయలేదు అన్న మాటలు అవాస్తవమని రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా గుంటూరు జిల్లాల్లో ఎక్కువగా వరి, మిర్చికి ఈ క్రాప్ బుకింగ్ చేయటం జరిగిందన్నారు. ఈ క్రాప్ బుకింగ్ చేసిన ప్రతి రైతుకి బీమా వర్తించటం జరుగుతుందని చెప్పారు. కొల్లిపర మండలంలో ఎక్కువ రైతులకు ఈ క్రాప్ బుకింగ్ చేయటం జరిగిందని, ఈ క్రాప్ చేయించుకున్న ప్రతి రైతుకు త్వరలోనే పంట నష్ట పరిహారం నేరుగా వారి ఖాతాలో జమ చేయటం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఉషారాణి, తహసీల్దార్ జి.నాంచారయ్య, ఎంపీడీఓ వి.విజయలక్ష్మి, ఏఓ కె.వెంకటరావు, పార్టీ మండల కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, పార్టీ నాయకులు ఆరిగ చంద్రారెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, బొమ్ము శ్రీనివాస రెడ్డి పాల్గొన్నారు.

అనంతరం తెనాలిలోనే ఐతానగర్, గోలిడొంక, నేలపాడు ప్రాంతాల్లో నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. తుఫాన్ వలన రైతాంగానికి జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ డి.చెన్నకేశవులు, మాజీ ఎంపీపీ, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస రావు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు బియ్యం, వస్త్రాలు పంపిణీ

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని కొమ్మమూరు కాల్వ కట్టపై నివాసిస్తున్న గిరిజనులకు తుఫాన్ దృష్ట్యా సినీ దర్శకుడు దిలీప్‌రాజా బుధవారం నూతన వస్త్రాలు, బియ్యం పంపిణీ చేశారు. అధికారులు ముందస్తుగా బాధితులను గ్రామంలోని ప్రభుత్వ భవనాలకు తరలించడం పట్ల అధికారులకు దిలీప్‌రాజా కృతజ్ఞతతు తెలిపారు. నిరుపేదలు అయిన గిరిజనులు కాల్వ కట్టపై పూరి పాకల్లో నివసిస్తున్నారని, వారికి ప్రభుత్వం గృహాలు నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

కాల్వ కట్టపై నివసిస్తున్న గిరిజనులు తరలింపు

తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరులోని కొమ్మమూరు కాల్వకట్టపై నివసిస్తున్న సుమారు పది గిరిజన కుటుంబాలను సురక్షిత ప్రాంతానికి తరలించారు. తహసీల్దార్ కె.రవిబాబు ఆదేశాల మేరకు కుటుంబాలలోని అందరిని గ్రామంలోని ఎలిమెంటరీ పాఠశాలకు తరలించినట్లు పంచాయతీ కార్యదర్శి ఎస్.కల్పన తెలిపారు. వారికి కావాల్సిన ఏర్పాట్లను చేస్తున్నట్లు చెప్పారు.

మిచాంగ్ తుఫాన్ ప్రభావం

- పలుచోట్ల నేలకు ఒరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- వాటిని వెంటనే తొలగించిన ఆయాశాఖల సిబ్బంది



నేలపాడు రోడ్డులో కరెంట్ తీగలపై పడిన చెట్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

తెనాలిఅర్బన్: మిచాంగ్ తుఫాన్ ప్రభావం తెనాలిలో కనిపించింది. రెండు రోజుల నుంచి తెనాలి పరిసర ప్రాంతాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం పడుతూ వచ్చింది. మంగళవారం ఉదయం నుంచి వర్షం నిలిచిపోవడంతో అన్ని ప్రభుత్వశాఖల అధికారులు అప్రమత్తమయ్యారు. రెండు రోజుల్లో కూలిన చెట్లను విద్యుత్ స్తంభాలను గుర్తించి వాటిని తొలగించారు. భారీ చెట్లను కట్ చేసి ట్రాక్టర్‌లో దూర ప్రాంతాలకు మున్సిపల్ సిబ్బంది వాటిని తరలించారు. వాహన రాకపోకలకు ఎటువంటి అవరోధాలు లేకుండా తగు చర్యలు తీసుకున్నారు. తెనాలి పట్టణంలో వర్షం ప్రభావం వలన ఆర్టీసీ బస్టాండ్, పట్టణంలోని పలు రోడ్లు జలమయమయ్యాయి. వాటిని ప్రత్యేక మోటార్లతో నీటిని బయటకుపంపే ఏర్పాటు అధికారులు చేశారు. నాజర్‌పేట, మారీసుపేట, ఐతానగర్, చినరావూరు వంటి ప్రాంతాల్లో విద్యుత్ లైన్లపై ఉన్న చెట్టు కొమ్మలను విద్యుత్ సిబ్బంది తొలగించారు. తెనాలి మండల పరిధిలోని పలు గ్రామాల్లో నిలిచిన వర్షపునీరును అధికారులు తొలగించే విధంగా చర్యలు తీసుకున్నారు. చావావారిపాలెంలో విద్యుత్ స్తంభం రోడ్డుపై పడింది. ఆ సమయంలో ఎవరు అక్కడ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అధికారులు దానిని తొలగించి విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్



రైల్వేస్టేషను సెంటరులో అంబేడ్కర్ విగ్రహం నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, చైర్‌పర్సన్ రాధిక, పార్టీ నేతలు



చినరావూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న యూత్ నేతలు

వర్ధంతి సభలో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళులర్పించారు. వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక రైల్వేస్టేషను సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, ఎంపీపీ డి.చెన్నకేశవులు, పార్టీ నాయకులతో కలిసి పుష్పాంజలి ఘటించారు. ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి గర్వించదగిన రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే శివకుమార్ నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయాలు, ఆకాంక్షలకు అనుగుణంగా రాజ్యాంగాన్ని అనుసరిస్తూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని చెప్పారు. ప్రజల హక్కులు, బాధ్యతలకు ప్రాధాన్యమిస్తూ అంబేడ్కర్ రాజ్యాంగ రచన చేశారని, ఆయన ఫలితంగానే సమాజంలోని అణగారిన వర్గాలు ఇప్పుడు అందరితో సమానంగా ఉన్నతస్థాయికి చేరుకుంటున్నారని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా నాణ్యమైన విద్యను అందిస్తూ, బడుగు, బలహీనవర్గాలకు సామాజిక సాధికారతను కల్పిస్తున్నారని గుర్తుచేశారు. అంబేడ్కర్ భావజాలాన్ని అర్థం చేసుకుని, ఆయన మార్గంలో నడవటమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళిగా చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షులు మద్దాళి శేషాచలం, షేక్ దుబాయ్‌బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు పేరం సంజీవరెడ్డి, మొగల్ అహ్మద్, యాతాటి అనిల్, షేక్ నూర్ ఇస్మాయిల్, దాసరి వీరవసంతరావు, కో-ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, మహ్మద్ గౌస్, క్లస్టర్-2 ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండ్లమూడి నాని, పార్టీ నాయకులు కనపర్తి అనిల్, ఉన్నవ సాల్మన్, నలగండ్ల రవిచంద్ర, రావూరి నరేష్, కన్నె నరేష్ పాల్గొన్నారు.

చినరావూరులో....

పట్టణ చినరావూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సల్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అక్కడి డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూత్ అధ్యక్షుడు, న్యాయవాది పిల్లి ప్రేమరాజు, 13వ వార్డు కౌన్సిలరు కుర్రా సుజాత, దేవరపల్లి కిషోర్, వెంకట్రావు, పిల్లి వీరయ్య, బడుగు బుజ్జిబాబు, జశ్వంత్, రాజేష్, రాంబాబు పాల్గొన్నారు.

12వ వార్డులో...

పట్టణ 12వ వార్డులోని కృష్ణుడి ఆలయం సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి గుంటూరు జిల్లా హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు పల్నాటి నాగరాజు మాట్లాడుతూ ప్రపంచ మేధావి, రాజ్యాంగ రచయిత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తిప్రదాతగా చెప్పారు. అంబేడ్కర్ సూచించిన చదువు చదివించు మార్గంలో బడుగు బలహీనవర్గా ప్రజలు ముందుకు సాగాలని సూచించారు. చైతన్య కాలేజ్ ప్రిన్సిపాల్ నన్నపనేని సునీల్, కుంగ్‌ఫూ మాస్టర్ జానీ, తిరుపతిరావు, జిల్లా ఉపాధ్యక్షుడు చాటగడ్డ ప్రసాద్, ఉపాధ్యక్షుడు షేక్ సుభాని, ఉపాధ్యాయుడు సాయి పాల్గొన్నారు.



12వ వార్డులో అంబేడ్కర్‌కు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ నివాళి

తక్షణమే నీటిని తరలించేందుకు చర్యలు

జిల్లా కలెక్టర్ వేణుగోపాల రెడ్డి



పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

తాడేపల్లిరూరల్: తుఫాన్ కారణంగా పంటపొలాల్లోనిలిచిపోయిన వర్షపు నీటిని తరలించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, వర్షపు నీటిని పంటపొలాల్లోంచి బయటకు తరలించేందుకు ఎంత ఖర్చు అయినా వెనుకాడవద్దని కలెక్టర్ ఎం. వేణుగోపాల రెడ్డి అన్నారు. బుధవారం గుంటూరు జిల్లాలోని దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. నీట మునిగిన వరి పొలాన్ని, నేలకొరిగిన అరటి తోటలను, పాడైపోయిన మినుము పంటను వివిధ శాఖల అధికారులతో కలసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మిచాంగ్ తుఫాన్ కారణంగా గుంటూరు జిల్లాలో అపారమైన నష్టం జరిగిందని, 36 గంటల వ్యవధిలో తెనాలి, మంగళగిరి, పొన్నూరు నియోజక వర్గాల్లో 150 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, మరికొన్ని చోట్ల 200 మి.మీ. నమోదు అయ్యిందని, పంటపొలాల్లో నిలిచిపోయిన వర్షపు నీటిని బయటకు తరలించేందుకు స్థానికంగా ఉన్న పరిస్థితులను సంయుక్తంగా పరిశీలించి చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాదంలో బీ ఫార్మసీ విద్యార్థిని మృతి

తాడేపల్లిరూరల్: కృష్ణానది కనకదుర్గ వారధిపై బుధవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో బీ ఫార్మసీ మూడో ఏడాది విద్యార్థిని అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్ఐ గిరిబాబు తెలిపిన వివరాలు.. ప్రకారం పట్టణ పరిధిలోని మహానాడు 13వ లైన్‌లో నివాసముండే రాంబాబు కుమార్తె బొప్పన కుసుమ ప్రియ(22) విజయవాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో బి.ఫార్మసీ చదువుతోంది. తన తమ్ముడు ఆదిత్య వెంకటసాయితో కలసి మధ్యాహ్నం విజయవాడ కళాశాలకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా వారధి మధ్యలో ఓ గుర్తుతెలియని వాహనం తగలడంతో రోడ్డుపై పడ్డారు. వెనక నుంచి వస్తున్న లారీ రోడ్డుపై పడిన కుసుమ ప్రియ మీద నుంచి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె తమ్ముడు ఆదిత్య వెంకట సాయికి స్వల్ప గాయాలు అయ్యాయి. ఆదిత్య వెంకట సాయికి 108లో వైద్యశాలకు తరలించారు. కుసుమ ప్రియ తండ్రి రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

ఎంపీపీ చెన్నకేశవులు



నందివెలుగులో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీపీ చెన్నకేశవులు, సర్పంచి

తెనాలిటౌన్: సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు పేర్కొన్నారు. రూరల్ మండలం నందివెలుగులో పల్లెకుపోదాం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. అనంతరం సచివాలయం-2లో అభివృద్ధి పథకాలపై ఏర్పాటు చేసిన బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నాయకులు, అధికారులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం సంక్షేమ పథకాలకు సంబంధించి ముద్రించిన కరపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. సచివాలయంలో జరిగిన సభకు పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, బాల్య వివాహాలను అరికట్టాలని కోరుతూ ఏపీఎం జయశ్రీ నాయకులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. సభలో ఎంపీపీ చెన్నకేశవులు మాట్లాడుతూ సచివాలయం-2 పరిధిలో రూ.27.19 కోట్లతో సంక్షేమ పథకాల కింద లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేసినట్లు తెలిపారు. అర్హులందరికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి పనిచేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌లను రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. గ్రామసర్పంచి ధూళిపాళ్ల పవన్‌కుమార్ మాట్లాడుతూ గ్రామంలో రూ.3.50 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మాణం చేసినట్లు చెప్పారు. రూ.2 కోట్లతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదులు నిర్మిస్తున్నామని, అంబేడ్కర్ కాలనీ సమీపంలో నిజాంపట్నం కాల్వ సమీపంలో వంతెనలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. గ్రామంలో పలు ప్రాంతాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం చేశామని, మోడల్ గ్రామంగా చేయడమే తమ లక్ష్యమన్నారు. సభలో ఎంపీడీఓ పి.ప్రతాప్‌రెడ్డి, ఈఓపీఆర్డీ జి.సుభాష్‌చంద్రబోస్, ఎంపీటీసీ సభ్యులు షేక్ సిలార్‌జానీ, గ్రామ ఉపసర్పంచి మంగ శివనాగేశ్వరరావు, పార్టీ నాయకులు బొంతు నరేంద్రరెడ్డి, వేముల మహేష్, బెజ్జం బాజీ, కానుగోలు సురేష్, సోమరాజు విజయలక్ష్మి, పంచాయతీ సభ్యులు కమాదుల స్వామి, వెంకటలక్ష్మి, రమాదేవి, ఎలక్ట్రికల్ ఏఈ వసంతరావు, సీసీ సుబ్బారావు పాల్గొన్నారు.

పథకాలను చేతి వృత్తిదారులు ఉపయోగించుకోవాలి

గ్రామీణ పరిశ్రమల అసిస్టెంట్ డైరెక్టర్ ఏజీ రావు



మహాత్మా గాంధీ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న అసిస్టెంట్ డైరెక్టర్ ఏజీ రావు

తెనాలిటౌన్: కేంద్ర ప్రభుత్వం చేతి వృత్తిదారులకు ప్రవేశపెట్టిన పీఎంఈజీపీ, విశ్వకర్మ, ఎంఎస్ఎఈ పథకాలను ఉపయోగించుకోవాలని గ్రామీణ పరిశ్రమలశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఏ.జి.రావు కోరారు. రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో గ్రామీణ పరిశ్రమల కమిషన్ (విజయవాడ) ఆర్థిక సహాయంతో అబార్డు స్వచ్ఛంద సంస్థ (గుంటూరు) ఆధ్వర్యంలో మట్టి వస్తువుల తయారీపై శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. శాలివాహన, సీతారామాంజనేయ సంఘానికి చెందిన 20 మంది చేతి వృత్తిదారుల(మట్టికుండల తయారీ)కు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుతగా జాతిపిత మహాత్మగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభకు అబార్డు సంస్థ సెక్రటరీ ఎం.రమణయ్య అధ్యక్షత వహించారు. సభలో అసిస్టెంట్ డైరెక్టర్ ఏజీ రావు మాట్లాడుతూ పది రోజుల పాటు ఆధునిక టెక్నాలజీతో సభ్యులకు శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం మార్కెటింగ్‌లో మేళాలు, ఎగ్జిబిషన్‌లో పాల్గొని వస్తువులు అమ్ముకోవచ్చని చెప్పారు. ప్రతి సభ్యుడు ఉత్పత్తిదారుడిగా ఎదగాలని, సమష్టిగా ఉత్పత్తులు చేసి ఉత్పత్తిదారుల సంఘంగా ఏర్పడాలన్నారు. దీని ద్వారా ఆదాయం పెంచుకుని ఆర్థిక అభివృద్ధి సాధించాలని తెలిపారు. అబార్డు సంస్థ సెక్రటరీ రమణయ్య మాట్లాడుతూ శిక్షణ పొందిన వారికి ఆన్‌లైన్ మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని, ఉత్పత్తిదారుల సంఘాలను ఏర్పాటు చేస్తామని, బ్యాంకుల ద్వారా రుణాలు పొందేందుకు సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ బెజ్జంకి హేమంత్, శాలివాహన సంఘ ప్రెసిడెంట్ గుమ్మడిదల సుబ్బారావు, సరిదన శంకర్, ముత్తయ్య, గుమ్మడిదల వీరాంజనేయులు, కుర్రంపల్లి యలమందయ్య, రాజవరపు ఆంజనేయులు, కానుక్ల బాజీబాబు, సరిదర ప్రసాద్, కోడూరు ఆంజనేయులు, పాల్గొన్నారు.

మార్చి 15, 16 తేదీల్లో ఏఎన్‌యూలో జాతీయ సదస్సు



జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాతీయ సదస్సు బ్రోచర్‌ను బుధవారం వైస్ చాన్సలర్ ఆచార్య పి. రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'బాబూ జగ్జీవన్‌రామ్ కాంట్రిబ్యూషన్స్ టు ఇండియన్ రూరల్ రీ కన్‌స్ట్రక్షన్ అండ్ అగ్రికల్చర్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించటం అభినందనీయమని తెలిపారు. జగ్జీవన్‌రామ్ ఆలోచనా విధానం, గ్రామీణ అభివృద్ధి, దేశంలో వ్యవసాయ రంగాల అభివృద్ధికి ఆయన చేపట్టిన చర్యలు, నేటి కాలంలో వాటి ఆవశ్యకతపై ఈ సదస్సులో క్షేత్రస్థాయిలో చర్చ జరగాలని ఆకాంక్షించారు. సదస్సు డైరెక్టర్, జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ ఆచార్య కె. మధుబాబు మాట్లాడుతూ 2024 మార్చి 15, 16 తేదీల్లో ఈ జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. సామాజిక ఉద్యమ కారునిగా, ప్రజాప్రతినిధిగా, కేంద్ర మంత్రిగా, జగ్జీవన్‌రామ్ మన దేశంలో గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ రంగం, ఆహార ధాన్యాల ఉత్పత్తి పెంపుదలకు కృషి చేశారన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ, ఆధునిక వంగడాలను ప్రవేశపెట్టడం వంటి అనేక అంశాలపై చట్టాలు, సంస్కరణలు తీసుకురావడానికి ప్రత్యేకంగా కృషి చేశారని వివరించారు. ఆయా అంశాల్లో ఆయన చేపట్టిన సంస్కరణలు, నేటి సమాజంలో వాటి ఆవశ్యకత తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నామని తెలిపారు. న్యూఢిల్లీలోని బాబూ జగ్జీవన్‌రామ్ నేషనల్ ఫౌండేషన్ తోపాటు దేశవ్యాప్తంగా పలు యూనివర్సిటీలలో ఉన్న అధ్యయన కేంద్రాల ప్రతినిధులు హాజరై పరిశోధన పత్రాలు సమర్పించనున్నాయని తెలిపారు. పరిశోధన పత్రాల్ని మార్చి 5వ తేదీలోగా సదస్సు డైరెక్టర్‌కు పంపాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ఓఎస్‌డీ ఆచార్య కె. సునీత, సదస్సు ట్రెజరర్ డాక్టర్ కె. సోమశేఖర్, అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జి. అనిత, అధ్యాపకులు డాక్టర్ ఎస్. రత్నకిశోర్, డాక్టర్ పి. శాంసన్, డాక్టర్ మహేంద్ర, డాక్టర్ రాజీవ్, పరిశోధకులు పి. అభిషేక్, వై. రాజేష్, సిబ్బంది ఎన్. ఎజ్రా పాల్గొన్నారు.

బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై అవగాహన అవసరం



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న స్వర్ణలత బృందం

గుంటూరు ఎడ్యుకేషన్: బేసిక్ లైఫ్ సపోర్ట్‌పై విద్యార్థినులు అవగాహన పెంచుకోవాలని జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ స్వర్ణలత పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో ''బేసిక్ లైఫ్ సపోర్ట్'' అనే అంశంపై విద్యార్థినులకు శిక్షణ ఇచ్చారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ స్వర్ణలత మాట్లాడుతూ ప్రాణాపాయస్థితిలో ఉన్న వారికి ఈ పద్ధతి ద్వారా ప్రాథమిక చికిత్స అందించి, బతికించవచ్చని తెలిపారు. దీన్ని సామాజిక బాధ్యతగా స్వీకరించి, విద్యార్థినులు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రత్యక్షంగా వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీఆర్ జోత్స్నకుమారి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు కె. సుబ్బరత్నమ్మ, డాక్టర్ డి. ధాత్రీకుమారి, సంతోష్ కుమారి, డాక్టర్ కె. విజయకుమారి, అధ్యాపకులు శాంతి శ్రీదేవి, కమల కరుణ, క్యూరీ, అనూరాధ, పీజీ డాక్టర్లు లావణ్య బృందం పాల్గొన్నారు.